క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

దోమలపెంట: స్థానిక ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సంతోషంలో మునిగారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. శ్రీనివాసరెడ్డి, హాజీబాబ, నాగేంద్ర, రాములు, రమేష్ వరలక్ష్మి, శైలజ తెలిపారు.

రూ.50 వేల విరాళం



పెద్దకొత్తపల్లి: దేవునితిరుమలాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం పేరుమాండ్లపల్లి గ్రామానికి చెందిన నలుకోటి రాజవర్ధన్‌రెడ్డి, నలుకోటి రమణరెడ్డి, నలుకోటి భాస్కర్‌రెడ్డిలు రూ.50 వేలను మాజీ సర్పంచ్ సత్యానికి సోమవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటస్వామి, శివశంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ: మండలంలోని జేపల్లిలో రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠకోసం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు వెల్జాల పద్మ వెంకటేష్‌లు సోమవారం రూ. 50 వేలు విరాళంగా దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో యువకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం



లింగాల: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతుందని ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, స్టాక్ గదిలో ఉన్న బియ్యం, ఇతర నిత్యావసర సరకుల నాణ్యతను చూశారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని, వంటగదిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేసీగుప్తా జయంతి



కందనూలు: వాసవీ క్లబ్ ఫౌండర్ కేసీగుప్తా జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు అర్థం సాయికృష్ణ, వనిత క్లబ్ అధ్యక్షురాలు అర్థం లలిత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అమర్‌సింగ్



అచ్చంపేట: అచ్చంపేట నీటి పారుదలశాఖ విభాగం డివిజన్–2ఈఈగా నియమితులైన అమర్‌సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొల్లాపూర్ నీటి పారుదల డివిజన్ డిప్యూటీ డీఈగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై అచ్చంపేటకు వచ్చారు. ఆయనకు డీఈలు బాలస్వామి, చందునాయక్, మాధవరావు సూపరింటెండెంట్ తాజొద్దీన్‌లు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల ఇళ్లను ఏఈ విజయ్‌కుమార్‌తోపాటు ఆయా పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. క్యాప్చర్ చేసి బిల్లులు చెల్లించేందుకు జాబితా తయారు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కోడేరు: మండలంలోని బావాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ భూమిపూజ చేశారు. ప్రభుత్వ కొలతల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు.



అచ్చంపేటలో పాల్గొన్న మహిళలు



కల్వకుర్తిలో కోలాటం వేస్తున్న మహిళలు

ఘనంగా వినాయకుల నిమజ్జనం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. ప్రత్యేక వాహనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధులలో శోభాయాత్రగా వెళ్తూ కోలాటాలు, నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడుతూ సందడి చేశారు. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి లడ్డును వేలం పాట నిర్వహించారు. అచ్చంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉప్పునుంతల మండలం తాడూరు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా అచ్చంపేట మండలం నడింపల్లి, చంద్రసాగర్, డిండి, దుందుబీ నదిలో వినాయకులను నిమజ్జనం చేశారు. తిమ్మాజిపేటలో రచ్చబండవద్దకు శోభాయాత్రగా గణనాథులను తరలించారు. గ్రామ సమీపంలోని ఊర చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కల్వకుర్తి వాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానం, వైఆర్ఎం కళాశాలతోపాటు హనుమాన్ నగర్‌లో, సరస్వతీశిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన గణపతులను నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పెంట్లవెల్లి, కొందురులలో గణనాథులను నిమజ్జనం చేశారు.



తిమ్మాజిపేటలో గణనాథుడి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు



వెల్దండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కోడేరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొల్లాపూర్‌లో..

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్‌లో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. వెల్దండలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలకపల్లి మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకులను నాగం శశిధర్‌రెడ్డి దర్శించుకున్నారు. కల్వకుర్తి, కొల్లాపూర్, తాడూరు, కోడేరు, మన్ననూరు, పెంట్లవెల్లిలో అన్నదానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాక్షి, నెట్‌వర్క్

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా చందు



కల్వకుర్తిరూరల్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా యువతి విభాగం అధ్యక్షుడిగా కల్వకుర్తి పట్టణానికి చెందిన చందుముదిరాజ్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌లు ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెద్దవిజయ్ కుమార్, భానుచందర్, శేఖర్, వెంకటయ్య, రామస్వామి, జంగయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంట మార్పిడిపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

బిజినేపల్లి: పంట మార్పిడిపై రైతులు దృష్టి సారించాలని రావేఫ్ విద్యార్థులు కోరారు. సోమవారం మండలంలోని మంగనూర్‌లో సమగ్ర వ్యవసాయంపై ఆ గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఒకే పంటను కాకుండా పలు రకాల పంటలను సాగు చేయాలని, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. సమగ్ర వ్యవసాయం చేయడం వలన ఒక పంటకు నష్టం వాటిల్లినా మిగిలిన పంటలు లాభాలు ఆర్జించవచ్చన్నారు. మౌనిక, జవేరియా, అప్సన్, శ్రీశాంతి, ఆయేషా, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రాజాపూర్ టీబీ వైద్య శిబిరం



కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో సోమవారం భవిష్య భారతి జన్‌జీవన్ సహకారంతో ఉచిత టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, దగ్గు, ఆయాసం, టీబీ లక్షణాలు ఉన్న వారికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు శిరీష మాట్లాడుతూ ఆల్కహాల్, మత్తు పదార్థాలు వాడరాదని వీటిని తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడుతాయన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ముక్తాజ్, శ్రీనివాస్, పవన్, ఏఎన్ఎం నారమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతు చేపట్టాలి



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ దగ్గర గుంతలమయంగా మారడంతో సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, నాగపూర్ మధు మాట్లాడారు. హైదరాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారులు కూడా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వెల్దండ: వినాయక నిమజ్జ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జనం రోజున ఎలాంటి డీజేలకు అనుమతులు లేవన్నారు. ఉత్సవ ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలో చోటుచేసుకోకుండా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. విద్యుత్ వైర్లను గమనించుకోవాలని, నిమజ్జన సమయంలో చెరువుల్లో, కుంటల్లో ఈత వచ్చిన వ్యక్తులు మాత్రమే వెళ్లాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన సీసీలు

వెల్దండ: మండల మహిళ సమాఖ్య కార్యాలయానికి బదిలీపై వచ్చిన సీసీలు సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఏపీఎం శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీసీలు యాదగిరి కల్వకుర్తి మండలానికి, రాము చారకొండ మండలానికి, రవి మిడ్జిల్ మండలానికి బదిలీపై వెళ్లినట్లు వివరించారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం నుంచి రాములయ్య వెల్దండ, చారకొండ మండలం నుంచి విమల నూతనంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. రాములయ్య వెల్దండ, గెల్వమ్మ చెదురుపల్లి, విమల పెద్దాపూర్, కిష్టమ్మ కొత్త క్లస్టర్ సీసీలుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏపీఎం వారికి నియామక పత్రాలను అందజేశారు.

క్రమశిక్షణతో చదివితే గుర్తింపు



కల్వకుర్తి టౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే సమాజంలో గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సోషల్ మీడియా మోజులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఆడెం నిరంజన్ సంబంధించిన గేదెలను మేపేందుకు సమీపంలోని పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ గేదెలు గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు తెగి పడిన విద్యుత్‌తీగలకు తగలడంతో విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. గేదేల విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులకు గేదెలను పరిశీలించారు.

ఆర్థికసాయం అందజేత

తెలకపల్లి: మండలంలోని గట్టురాయిపాకులకు చెందిన అలేటి మశన్నకు సంబంధించిన రెండు కాడెద్దులు ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందాయి. గ్రామస్తులు, గ్రామ యువకులు యువజన సంఘాల నాయకులు వివిధ రాజకీయ నాయకులు డబ్బులను పోగు చేసుకొని మొత్తం రూ.50 వేలు బాధితుడికి అందజేశారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మమమూద్‌షేక్ హాజరయ్యారు. బ్రాంచ్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, చంద్రశేకర్, రాంగోపాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, లక్ష్మణాచారి, వీరబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వినాయకుడికి వినతిపత్రం

కందనూలు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఏబీవీపీ నాగర్‌కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో వినాయకుడికి వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు మాట్లాడుతూ బకాయిలు రూ.8500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, జిల్లా కేలో భరత్ కన్వీనర్ రమేష్, కళాశాల అధ్యక్షుడు శివ, నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని కుర్మిద్ద కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్ అన్నారు. సోమవారం 105 రేషన్‌కార్డులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. మాజీ సర్పంచ్‌లు దామోదర్‌గౌడ్, శేఖర్, మైసయ్య, సాయిలు, జంగయ్య, వెంకట్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆదివాసీల మనుగడకు ప్రభుత్వాలు కృషి చేయాలి

మన్ననూర్: ఆదివాసీల మనుగడకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని రాష్ట్ర పీవీటీజీల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని చెంచు, కొలాం, తోటి, కొండరెడ్డి పీవీటీజీ (ఆదివాసీలు) తెగల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర పీవీటీజీల ఐక్యవేదిక ఏర్పాటు చేసి అందులో నల్లమల యువకులకు ప్రత్యేక స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవితో పాటు కార్యనిర్వాహక సభ్యులుగా మన్ననూర్‌కు చెందిన శంకరయ్య, రాజేంద్ర ప్రసాద్ మాచారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెద్దిరాజుకు స్థానం దక్కిందని తెలిపారు.

రాంచంద్రారెడ్డికి నివాళి

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జైపాల్‌రెడ్డి తండ్రి స్వర్గీయ రాంచంద్రారెడ్డి దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, మల్కాజిగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. రాంచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

లింగాల: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న వివిధ రకాల సేవలపై సోమవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సూరాపూర్‌లో కర్నూల్ నారాయణ బృందం ఖాతాదారులకు కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. పొదుపు, రుణాలు, బీమా పథకాల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వ ద్వారా అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు ఎండీ మన్సూర్, రూపేష్, శ్రీశైలం, బ్యాంక్ సిబ్బంది మురళి, చెన్నయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్ రూరల్: జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్టు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ నా యక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమ వారం మండలంలోని ముక్కిడిగుండంలో ఆయన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా దళిత, గిరిజనులు, కొల్లాపూర్, అచ్చంపేట, తదితర ప్రాంతాలలో ఫారెస్టు భూములను శిస్తూ చేసుకుంటు జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులు ఆర్థికంగా ఎదగాలి



వెల్దండ: మహిళా రైతులు ఆర్థికంగా ఎదగాలని కల్వకుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సహాయ సంఘంలో ఉన్న మహిళా రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీలో మహిళ రైతులకు వేరుశనగా విత్తనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ వంట నూనెల మిషన్ పథకం ద్వారా (ఎన్ఎంఈఓ) 1250 ఎకరాల్లో 650 మంది రైతులకు 2050 బస్తాల వచ్చాయన్నారు. మండలంలోని సంఘంలో 400మంది రైతులు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో కల్వకుర్తి టెక్నికల్ ఏఓ మంజుల, వెల్దండ ఏఓ శోభారాణి, ఏపీఎం సంతోష్, శ్రీదేవి, ఏఈఓలు సురేష్‌గౌడు, గణేష్, డాక్యానాయక్, విజయలక్ష్మి, బిన్నతి, లక్ష్మీప్రసన్న, సీసీలు, సిబ్బంది ఉన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని ర్యాలీ



నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పెయింటర్స్ యూనియన్ ప్రథమ జిల్లా మహాసభల సందర్భంగా బస్‌డిపో నుంచి మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనంరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడులుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించా రు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనంద్, రాజు, కేశవులు, సింహయ్య, శ్రీను, శివ, నాగరాజు, భరత్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని నిరసన

కల్వకుర్తి టౌన్: ఉద్యోగులకు ప్రస్తుతం అందుతున్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎన్‌జీఓ అధ్యక్షుడు సురేష్ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు నిరసన తెలియజేశారు. టీఎన్‌జీఓ సీపీఎస్ ఉద్యోగ కమిటీ సభ్యులు లక్ష్మీ నరసింహారావు, రాజేందర్, రాఘవేందర్, నెహ్రూ, వెంకటేశ్వర్, మహేష్, వెంకటయ్య, సతీష్, మల్లేష్‌లు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహదినం

దోమలపెంట: స్థానిక ప్రభుత్వ ఉన్నత ప్రాజెక్టు పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్షన్ విద్రోహ దినోత్సవం నిర్వహించారు. ఎస్.శంకర్, రాథోడ్, స్టెల్లా, అశోక్, వీరశేఖర్, విజయ, పరమేష్, జయమ్మ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి..

మన్ననూర్: స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. హెచ్ఎం సిద్ధార్థ మహదేవ్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకుర్తిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, టీఎన్‌జీఓ సభ్యులు

పెన్షన్ విద్రోహ దినం

నాగర్‌కర్నూల్ రూరల్: టీజీజేఏసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు కృష్ణ, గోవర్ధన్, మురళి, మధుసూదన్‌రెడ్డి, సంజీవ్, ఆంజనేయులు, లక్ష్మయ్య, లక్ష్మీనర్సింహారావు, లలిత, వివిధ సంఘాల నాయకులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు



ధర్నాకు తరలివెళ్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కందనూలు/అచ్చంపేటరూరల్/పెద్దకొత్తపల్లి: పాత పెన్షన్ సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పాత పెన్షన్ సాధన సభకు నాగర్‌కర్నూల్, అచ్చంపేట, పెద్దకొత్తపల్లి నియోజకవర్గాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. నాగర్‌కర్నూల్‌లో పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అమరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మీనర్సింహా రావు, శ్రీనివాసులు, సనాతన బాలస్వామి, అచ్చంపేటలో జేఏసీ చైర్మన్ గణేష్‌యాదవ్, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీపీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామావత్ కృష్ణ, అల్లాజీ, ఆంజనేయులు, శంకర్, లక్ష్మణ్, లోకేష్, చంద్రకళ, శ్రీదేవి, మౌనిక, బామిని, దనమ్మ, జ్యోతి, కౌసల్య, పెద్దకొత్తపల్లిలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర అసోసియేట్ కద్దాల పరమేష్, ఉపాధ్యక్షులు శివుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి



ఇళ్లు కోల్పోయిన బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లి గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులను కలిసి వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డువిస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నా అధికార పార్టీ నాయకులు మాట తప్పారన్నారు. గ్రామంలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులను పునరుద్ధరించాలన్నారు. గ్రామంలో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్న ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గ్రామంలోని బీసీ ప్లాట్లకు తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న నిబంధనలను ఎత్తివేసి అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. విస్తరణ బాధితులకు న్యాయ చేయకుంటే పార్టీ పక్షాన ఉంటూ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.